ఘనంగా గ్రామ దేవతల పండుగ

విశాలాంధ్ర - భీమిలి : బీచ్ రోడ్డు లోని మంగమారిపేట గ్రామ దేవత శ్రీ ఎర్నిమాంబ సహిత ఏడు అమ్మవార్ల వార్షిక పసుపు కుంకుమ సమర్పణ ఉత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. అర్చకులు అమ్మవార్లకు మంగళ స్నానం చేసి, ప్రత్యేకంగా అలంకరించి, పూజ అభిషేకాలు చేశారు. గ్రామస్తులు వేలాదిగా తరలి వచ్చి చీరలు చూపి పసుపు కుంకంలు, పండ్లు కాయలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ డి. అచ్చారావు, గ్రామ పెద్దలు వాసుపల్లి నూకరాజు, వాసుపల్లి నల్ల బాబు, మేరుగు అప్పన్న, మత్స్యకార సొసైటీ చైర్మన్ గరికిన ఎల్లయ్య, ఇతర ప్రతినిధులు వాసుపల్లి నర్సింగ రావు, బడే చిన్నారావు, సూరత్ నూక రాజు, సూరాడ పరదేశి, వాసుపల్లి వెంకట్, వాసుపల్లి నాగరాజు, మేరుగు అప్పల రాజు, మెరుగు చిన్నారావు, దూడ నర్సింగరావు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం ఓటమి పాలవ్వడం ఖాయం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

విశాలాంధ్ర - విశాఖ : కేంద్రంలో బిజెపి ప్రభుత్వం, రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం ఓటమి పాలవ్వడం ఖాయమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ అన్నారు. విశాఖలో అల్లిపురంలోని సిపిఐ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఓటమి ఖాయమని గ్రహించిన ప్రధాని నరేంద్ర మోడీ నైరాశ్యంలోకి వెళ్లారని.., నిరాశా, నిస్పృహలతో ఏం మాట్లాడుతున్నారో తెలియని స్థితిలో ప్రసంగాలు చేస్తున్నారని విమర్శించారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ముస్లింలకు ఆస్తులను పంచి పెడతారని, అయోధ్యలోని రామ మందిరాన్ని కూల్చివేస్తారంటూ మోడీ మాట్లాడడం ఆయనలోని అభద్రతా భావానికి నిదర్శనమని అన్నారు. దేశంలోని 145 కోట్ల ప్రజలు లౌకిక వాదులని అన్నారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడడానికి కమ్యూనిస్టులు ఎంతో కృషి చేస్తున్నారని చెప్పారు. కేంద్రంలో అధికారంలోకి రానున్న ఇండియా కూటమి బాధ్యతతో పరిపాలన సాగించాలని అన్నారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడడానికి కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలు, లౌకికవాద పార్టీలు కలిసి ఇండియా కూటమిగా ఏర్పడ్డాయని తెలిపారు. రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అవినీతి కారణంగా ఎన్నికల్లో ఓడిపోనుందని చెప్పారు. ఎన్నికల్లో డబ్బులు పంపిణీ విచ్చలవిడిగా జరిగిందని అన్నారు. డబ్బుల కోసం అభ్యర్థుల ఇళ్లు, కార్యాలయాలపై ఓటర్లు దాడి చేయడం వంటి ప్రమాదకర ధోరణులు కనిపించాయని అన్నారు. ఇలాంటి పరిస్థితులు మారాల్సిన అవసరం ఎంతో ఉందని అన్నారు. ఇలాంటి పరిస్థితులు కొనసాగితే సామాన్యులు భవిష్యత్తులో ఎన్నికల్లో పోటీ చేసే పరిస్థితి ఉండదని చెప్పారు గతంలో డబ్బుల్ని ఓటర్లు నిరాకరించే వారిని, ఇప్పుడు హక్కుగా భావిస్తున్నారని అన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం పైడిరాజు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కాంగ్రెస్ విశాఖ పార్లమెంట్ అభ్యర్థి పి సత్యారెడ్డి, సిపిఐ విశాఖ పశ్చిమ నియోజకవర్గం అభ్యర్థి అత్తిలి విమల, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి సత్యనారాయణమూర్తి, సిపిఐ మాజీ శాసనసభ్యులు మానం ఆంజనేయులు, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి వెంకటరావు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వజ్జిపర్తి శ్రీనివాస్, ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర నాయకురాలు డాక్టరు సీతల్ మదన్, సిపిఐ అనకాపల్లి జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ తదితరులు మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులు రజియా బేగం, డి.నూకరాజు, ఎర్రయ్య, రమణ, శ్రీనివాస్, సిపిఐ ఉమ్మడి జిల్లానాయకులు చలసాని రాఘవేంద్రరావు, జి ఎస్ జె అత్యుతరావు, కసిరెడ్డి సత్యనారాయణ, ఎస్కె.రెహమాన్, ఆర్ శ్రీనివాసరావు, కె.సత్యాంజనేయ, జి రాంబాబు, పి.చంద్రశేఖర్, ఎం మన్మధరావు, సిఎస్ క్షేత్రపాల్, రాజాన దొరబాబు, జి.గురుబాబు, క్రాంతి, వి అర్జున్ తదితరులతో పాటు సిపిఐ, సిపిఎం కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కూటమిదే విజయం...

దక్షిణ కూటమి నేతల సమావేశంలో వంశీకృష్ణ...

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం : కూటమిదే విజయం అని వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో తెలుగుదేశం, జనసేన, బిజెపి ఉమ్మడి నాయకులు కార్యకర్తలు ఆత్మీయ సమావేశం జరింగింది. ఈ సందర్భంగా వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతు ఎన్నికలలో కష్టపడిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబునాయుడు అధ్యక్షతన ప్రధాని నరేంద్ర మోడీ, పవన్ కళ్యాణ్ సహకారంతో కూటమి ప్రభుత్వం ఏర్పడబోతుంది అని అన్నారు. విశాఖ దక్షిణ నియోజకవర్గం లో అత్యధిక మెజారిటీతో గెలుస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో అరాచక పాలనను అంతం చేయడానికి కష్టపడిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఓటమి అర్థమై పోలింగ్ రోజు మధ్యాహ్నం నుంచే వైసీపీ నాయకులు పోలింగ్ బూతులు వదిలేసి వెళ్లిపోయారు అని అన్నారు. జగన్మోహన్‌రెడ్డిని ప్రజలు ఇప్పటికే పీకేశారు. జగన్ ప్రశాంతంగా లండన్‌లోనే ఉండాలి అని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో దక్షిణ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ సీతంరాజు సుధాకర్, కార్పొరేటర్లు మాజీ కార్పొరేటర్లు నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

చిత్రకళా పోటీలతో సృజనాత్మకత గుర్తింపు

విశాలాంధ్ర - మల్కాపురం : చిత్రకళా పోటీలలో పాల్గొనడం ద్వారా సృజనాత్మకత వెల్లి విరుస్తుందని, ప్రతిభకు తగిన గుర్తింపు లభిస్తుందని జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రామ్ అధికారి ఇ.పి.ఎస్. భాగ్యలక్ష్మి అన్నారు. స్థానిక మల్కాపురంలోని ప్రకాష్ నగర్‌లో గల శాఖా గ్రంథాలయంలో ఈనెల15వ తేదీ నుండి నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా ఆమె ఆదివారం శిబిరాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తూ - చిత్రకళకు 64 కళల్లో అత్యున్నత స్థానం ఉందని, చిత్రాన్ని ఆవిష్కరించడంలో గల నేర్పు, రంగుల కలయిక చిత్రకారుని ప్రతిభను, కళా దృష్టిని తెలియజేస్తాయని అన్నారు. చిన్నతనం నుండి విద్యార్థులకు చిత్రకళలో మెలకువలు పాఠశాలల్లో మరియు వివిధ శిక్షణ శిబిరాల్లో నేర్పాలని అన్నారు. రాజా రవి వర్మ, వడ్డాది పాపయ్య, అంట్యాకుల పైడిరాజు వంటి ప్రముఖ చిత్రకారులను గురించి చిన్నారులు తెలుసుకోవాలని అన్నారు. అనంతరం "గ్రంథాలయాల్లో వేసవి శిక్షణ శిబిరాలు" అనే అంశంపై సీనియర్ విద్యార్థులకు, "అందమైన ప్రకృతి దృశ్యం" అనే అంశంపై జూనియర్ విద్యార్థులకు పోటీలను నిర్వహించారు. పోటీలలో 20 మంది పాల్గొన్నారు. న్యాయ నిర్ణేతలుగా శ్రీ కె.సత్తిరాజు, గ్రంథాలయాధికారి శ్రీ వి.అజయ్ కుమార్ మరియు ప్రముఖ అంబేద్కరీయులు సిద్ధార్థ వ్యవహరించారు. అనంతరం విద్యార్థులు వివిధ రకాల కథలను పఠించారు.

ద్విచక్ర వాహన ప్రమాదంలో తీవ్రంగా గాయపడి అచేతనంగా ఉన్న యువకుడు

విశాలాంధ్ర - విశాఖ సిటీ : విశాఖపట్నంలోని అడవి వరం దగ్గర రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలో పైనాపిల్ కాలనీ లో నివాసం ఉంటున్న షేక్ ఖాజా సప్రుద్దీన్ తీవ్రంగా గాయపడి ప్రాణాపాయ స్థితిలో అచేతనంగా పడి ఉన్నాడు. తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు అందించిన వివరాల ప్రకారం చింతపల్లి లో నివాసం ఉంటున్న తమకు ఉపాధి అవకాశాలు సన్నగిల్లడంతో బ్రతుకు తెరువు వెతుక్కునే క్రమంలోనూ, అదే విధంగా పిల్లల చదువుల నిమిత్తం విశాఖకు వలస వచ్చి పైనాపిల్ కాలనీ లో చిన్న అద్దె గృహంలో నివాసం ఉంటూ దుకాణంలో పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించు కుంటున్నామనీ, ఈ క్రమంలో చేతికి అందివచ్చిన కుమారుడు షేక్ సప్రుద్దీన్ సింహాచలం నుండి అడవివరం మీదుగా పైనాపిల్ కాలనీ కి వస్తుండగా గుర్తు తెలియని ద్విచక్ర వాహనం పరిమితికి మించి (భార్యా పిల్లలతో) ప్రయాణం చేయడమే గాక రాంగ్ రూట్లో వచ్చి బలంగా ఢీకొనడంతో ఎడమ కాలి తుంటి ఎముక, ఎడమ చేయి విరగడంతో పాటు వెన్నుపూస, పక్కటెముక లతోపాతూ మరో రెండు చోట్ల చిన్నచిన్న క్రాక్ లు ఉండడంతో పడిన చోటే అచేతనంగా వదిలేసి ప్రమాదం చేసిన వ్యక్తి పట్టించుకోక పోవడంతో సుమారు అరగంటసేపు అదే స్థితిలో ఉన్న నా కుమారుని పరిస్థితి గమనించిన కొంతమంది వ్యక్తులు సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన వెళ్లి అచేతనంగా ఉన్న కుమారుని చూసి కన్నీటి పర్యంతం అయ్యానన్నారు. వెంటనే స్పందించిన స్థానిక యువకుల సహాయంతో విమ్స్ ఆసుపత్రికి తీసుకువెళ్లి ప్రథమ చికిత్స చేయించి మరుసటి రోజు మెడి కవర్ ఆసుపత్రిలో తుంటి ఎముక మరియు ఎడమ చేయి లకు శస్త్ర చికిత్సలు చేయించడం జరిగిందన్నారు. ఎక్కువ మందిని ఎక్కించుకోవడమే గాక, రాంగ్ రూట్లో నా కుమారుని వాహనాన్ని గుద్దిన వ్యక్తి నా కుమారునిపై కేసు పెట్టడం ఆశ్చర్యంగా ఉందన్నారు. చేతికి అంది వచ్చిన కుమారుని అచేతనంగా చేసిన వారిపై చర్యలు తీసుకుని తన కుమారునికి తగు న్యాయం చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

సింహాద్రి అప్పన్నను దర్శించుకున్న సుప్రీం కోర్టు జడ్జి

విశాలాంధ్ర - సింహాచలం : ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహలక్ష్మీనరసింహస్వామి వారిని సుప్రిమ్ కోర్ట్ న్యాయమూర్తి సందీప్ మెహతా తదితరులకు దర్శించుకున్నారు. వీరికి డిఈఓ సుజాత, ఆలయ సహాయ కార్య నిర్వహణాధికారి ఎస్ ఆనంద్ కుమార్, ఇతర అధికారులు పూల మాల వేసి ఘన స్వాగతం పలికారు. తొలుత వీరు కప్ప స్తంభం ఆలింగనం చేసుకుని తమ గోత్ర నామాలతో స్వామివారికి సంకల్పం చేయించారు. దర్శనానంతరం వేద పండితులు ఆశీర్వచనం పలికారు. పిదప ఏఈఓ స్వామివారి శేష వస్త్రంతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఘనంగా సుందరయ్య వర్ధంతి

విశాలాంధ్ర - భీమిలి : పీడిత ప్రజల ప్రియతమ నేత, దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత, అమర జీవి పుచ్చల పల్లి సుందరయ్య వర్ధంతి ని ఆదివారం స్థానిక సి ఐ టి యు కార్యాలయం వద్ద ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సి పి ఎం, భీమిలి జోన్ నాయకులు రవ్వ నరసింగరావు, ఎస్ అప్పల నాయుడు మాట్లాడుతూ, సుందరయ్య జీవితం నేటికీ స్ఫూర్తి దాయకం అని కొనియాడారు. నాడు సుందరయ్య రాసిన "విశాలాంధ్ర లో ప్రజారాజ్యం " పుస్తకం లోని అనేక అంశాలు నేటికీ మననం చేసుకో వాల్సిన ఆవశ్యకతను గుర్తు చేశారు. ప్రజల చేతికి అధికారం రావాలంటే పంచాయితీ వ్యవస్థ బలపడాలని సుందరయ్య బలంగా నమ్మారని నొక్కి చెప్పారు. 18 ఏళ్ళు దాటిన వయోజునులం తా గ్రామ సభల్లో భాగస్వామిగా ఉండాలని ఆయన కోరుకున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్య కర్తలు, సాను భూతి పరులు క(రి.రాము,జీరు సత్యా రావు, కానూరి రమణ, ఆనంద్, సూరి బాబు, సన్యా సప్పుడు తది తరులు పాల్గొన్నారు

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

జై భారత్ నేషనల్ పార్టీ నార్త్ అభ్యర్థి వీవీ లక్ష్మీనారాయణ

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం : తమ పార్టీ గెలుపు కోసం ఎన్నికల ప్రచారంలో కృషిచేసిన కార్యకర్తలు, అభిమానులు, స్థానికుల కోసం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్టు జై భారత్ నేషనల్ పార్టీవ్యవస్థాపకులు, నార్త్ అభ్యర్థి వీ వీ లక్ష్మీనారాయణ తెలిపారు. నెలకు పైగా ఎన్నికల ప్రచారం లో కార్యకర్తలు కష్ట పడ్డారు. సీతమ్మదార ఏఎస్ ఆర్ నగర్‌లోని పార్టీ ఉత్తర నియోజకవర్గం కార్యాలయంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారం భించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఉక్కు నగరంలోని మాధవ్ బాగ్ ఆస్పత్రి సహకారంతో వైద్య శిబిరం ఏర్పాటు చేశామని తెలిపారు. ఆరోగ్యమే ఆస్తి అని దానిని ప్రతి ఒక్కరూ కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. దేశీయ వైద్య విధానం, ఆయుర్వేదం ఇంకా ప్రాచుర్యంలోకి రావాలన్నారు. ప్రతి ఒక్కరికి వ్యాయామం, డైట్ అవసరం అన్నారు. చిన్న వయసులోనే మధుమేహం ప్రబలడం విచారకరమని ఈ సి జీ, షుగర్ తదితర పరీక్షలను ఉచితంగా చేస్తున్నమన్నారు. ఆస్పత్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రఘు రామ్ చక్రవర్తి మాట్లాడుతూ, ఆయుర్వేదం వైద్యంతో సంపూర్ణ ఆరోగ్యం అందిస్తున్నా మన్నారు. గత 20 ఏళ్లుగా ముంబాయిలో ఆస్పత్రి ద్వారా సేవలు అందిస్తున్నామని తెలిపారు. అలాగే అత్యవసర సేవలు కూడా అందిస్తున్నామని వెల్లడించారు. రోగులకు యోగ, వ్యాయామం, పంచ కర్మ ద్వారా వైద్యం అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జై భారత్ నేషనల్ పార్టీ నాయకులు అన్నపూర్ణ, మాధవి లత, శ్రీనివాస రావు, సాయి కుమార్, కృష్ణా రావు, భాష , మాధవ్ బాగ్ ఆస్పత్రి డాక్టర్ ఝాన్సీ, ఏ ఓ నానాజీ, పారా మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

విశాఖ పార్లమెంటు పోలింగ్‌లో ఓటర్ల జోరు...

ఫలితాలపై ఉత్కంఠ హోరు...

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం : విశాఖ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో 2019 ఎన్నికలతో పోల్చితే పోలింగ్ శాతం బాగానే పెరిగింది. విశాఖ పార్లమెంట్ పరిధిలో భారీగా పోలింగ్ గెలుపు అవకాశాలపై పార్టీల లెక్కల్లో మునిగి తేలిపోతున్నాయి. విశాఖ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో 2019 ఎన్నికలతో పోల్చితే పోలింగ్ శాతం బాగానే పెరిగింది. దీంతో ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు ఓట్ల లెక్కల విశ్లేషణల్లో నిమగ్నమయ్యారు. తమకే విజయం దక్కుతుందని ఎవరికి వారు నమ్మకంగా ఉన్నారు. 2019లో తెదేపా, భాజపా, జనసేనలు వేరువేరుగా పోటీ చేశాయి. విశాఖ లోక్‌సభ పరిధిలో ఎస్.కోట, భీమిలి, విశాఖ తూర్పు, దక్షిణం, ఉత్తరం, పశ్చిమం, గాజువాక అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. పార్లమెంట్ పరిధిలో 19,27,303 మంది ఓటర్లు ఉంటే, 71.11శాతం చొప్పున 13,70,484 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. వీరిలో పురుషులు 6,66,289 మంది, మహిళలు 7,04,154, ఇతరులు 41 మంది ఉన్నారు. ఈసారి మూడు పార్టీలు కలిసి కూటమిగా ఏర్పడ్డాయి. ఉమ్మడి అభ్యర్థిగా తెదేపా నేత ఎం.శ్రీభరత్‌ను నిలబెట్టాయి. వైకాపా తరఫున మాజీ ఎంపీ బొత్స ఝాన్సీ పోటీ చేశారు. విశాఖ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల బరిలో ఈసారి 33 మంది పోటీపడ్డారు. కీలక పోరు మాత్రం తెదేపా, వైకాపాల మధ్యే నెలకొంది. ప్రచారం పరంగా ముందంజలో ఉండడం, కూటమిగా పోటీ చేయడం, వైకాపా పాలనపై వ్యతిరేకత, పోలింగ్ శాతం పెరగడం, యువత అండగా నిలవడం వంటి అంశాలు తమకు కలిసివస్తాయని కూటమి అభ్యర్థి అంచనావేస్తున్నారు. భారీ మెజార్టీ సాధిస్తామనే నమ్మకం వ్యక్తం చేస్తున్నారు.

మహిళలు అధికంగా ఓటు వేశారని, విజయం తమనే వరిస్తుందని వైకాపా నేతలు విశ్వాసంతో ఉన్నారు. 2019 ఎన్నికల్లో 18,25,769 మంది ఓటర్లలో 67.26 శాతం చొప్పున 12,28,070 మంది ఓటు వేశారు. వీరిలో పురుషులు 6,07,034, మహిళలు 6,21,028, ఇతరులు 8 మంది ఉన్నారు. 2019 ఎన్నికలతో పోల్చితే ఈసారి 1,42,414 ఎక్కువ మంది ఓటు హక్కును వినియోగించు కున్నారు. పోలైన మహిళా ఓట్ల సంఖ్య కూడా అధికంగా ఉంది.గత ఎన్నికల్లో 6,728 మంది పోస్టల్ బ్యాలెట్ వినియోగిస్తే, ఈసారి ఉద్యోగులు, అత్యవసర సేవల ఉద్యోగులు, వృద్ధులు, దివ్యాంగులు కలిపి 22వేల మందికిపైగా వినియోగించారు. జూన్ 4న వెలువడే ఫలితాలు కోసం విశాఖ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఉన్న ప్రజలంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

విశాలాంధ్ర - ఆనందపురం : ఆనందపురం మండలం గొట్టిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2008 -2009 సంవత్సరంలో విద్యను అభ్యసించిన10వ తరగతి విద్యార్థులు మండలంలో గుడిలోవ వద్ద ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వ హించారు. అందులో భాగంగా గడిచిన జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ ప్రతి ఒక్కరు గడిచిపోయిన కాలాన్నీ గుర్తు చేసుకుంటూ సుమారు 15 సంవత్సరాలు దాటిన సందర్భంగా ఇలా కలవడం ఆనందంగా ఉందని, పదో తరగతిలో ఉన్న స్నేహ బంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఆటపాటలతో ఆనందంగా సరదాగా గడిపారు. అనంతరం బరువెక్కిన హృదయాలతో మరల కలుసుకుందామని తిరిగి ప్రయాణమయ్యారు.

పాలకుల ఆర్థిక విధానాల్లో మార్పు రావాలి

రాష్ట్ర కాంగ్రెస్ ఓబీసీ డిపార్ట్మెంట్ చైర్మన్ మూల వెంకటరావు

విశాలాంధ్ర - పెందుర్తి : పాలకుల ఆర్థిక విధానాల్లో మార్పు రానంత వరకు ప్రజలకు ఒరిగేది శూన్యమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ ఓబీసీ డిపార్ట్మెంట్ చైర్మన్ మూల వెంకటరావు అన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలోని వనరులను సద్వినియోగం చేసుకుని అప్పులకై వెంపర్లాడకుండా అందరికి ఉపాధి,ఉద్యోగ అవకాశాలు కల్పించి సొంత కాళ్ళపై నిలబడేలా చేయాలని నూతనంగా ఎన్నికయ్యే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. నిత్యావసర వస్తువులు ధరలను అదుపు చేయడం, రైతాంగానికి ఉచిత విద్యుత్, నిరుద్యోగ యువతకు జాబ్ గ్యారెంటీ, కుటీర పరిశ్రమలను ప్రోత్సహించడం, జాతీయ ఉపాధి హామి పథకాన్ని 200 రోజులకు పెంచడం, పబ్లిక్ రంగ పరిశ్రమలను పరిరక్షంచడం, అందరికి విద్య, వైద్యం ఉచితంగా అందిచడం వంటి చర్యల ద్వారా ఆర్థిక వ్యవస్థను పరిపుష్టం చేయవచ్చునని పేర్కొన్నారు. ప్రజలకు తాయిలాలు అందించి యాచకులు, సోమరిపోతులుగా చేస్తే సమాజం నిర్వీర్యం అవుతుందన్నారు. రాష్ట్రంలో కుంటు పడిన అభివృద్ధిని తిరిగి నిలదొక్కుకునేలా చేయాలని సూచించారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడటంతో పాటు ఆ పరిశ్రమకు తక్షణమే గనులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ పరం చేసిన పోర్టులను తిరిగి స్వాధినం చేసుకోవాలని, వెనుకబడిన ప్రాంతాలను అభివృద్ధి చేయాలని నూతన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ ఓబీసీ డిపార్ట్మెంట్ చైర్మన్ మూల వెంకటరావు తెలిపారు.

వైవి సుబ్బా రెడ్డికి ఘన స్వాగతం

విశాలాంధ్ర - పెందుర్తి : వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉత్తరాంధ్ర జిల్లాల సమన్వయకర్త వైవి సుబ్బారెడ్డికి విశాఖ విమానాశ్రయంలో ఆ పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఎన్నికల తర్వాత మొదటిసారిగా విశాఖపట్నం వచ్చిన సుబ్బారెడ్డికి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ట్రేడ్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోవింద పట్నాయక్ తదితరులు స్వాగతం పలికి పుష్ప గుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా ఉత్తరాంధ్ర జిల్లాలలో ఎన్నికల పోలింగ్, వైసీపీకి విజయావకాశాలు తదితర అంశాలపై వారు చర్చించారు.

అల్పపీడనం ప్రభావంతో మొదలైన వర్షాలు...

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం : ఐఎండి సూచనల ప్రకారం దక్షిణ అంతర్గత తమిళనాడు పరిసరాల్లో ఆవర్తనం కొనసాగుతుందని, మధ్య మహారాష్ట్ర నుండి దక్షిణ తమిళనాడు వరకు ద్రోణి విస్తరించి ఉందని విపత్తుల సంస్థ ఎండి రోణంకి కూర్మనాథ్ వెల్లడించారు. బుధవారం నాటికి నైరుతి బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని ఇది ఈశాన్య దిశగా కదులుతూ శుక్రవారం నాటికి వాయుగుండంగా కేంద్రీకృతమై అవకాశం ఉందన్నారు. దీని ప్రభావంతో సోమవారం పార్వతీపురంమన్యం, అల్లూరి సీతారామరాజు, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, అనంతపురం, శ్రీ సత్యసాయి, వైయస్ఆర్, అన్నమయ్య, చిత్తూరు మరియు తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ లిపిడుగులతో కూడిన తెలిపాటి నుంచి మోస్తరు వర్షాలులి కురిసే అవకాశం ఉందని విపత్తుల సంస్థ ఎండి రోణంకి కూర్మనాథ్ సూచించారు. మరోవైపు రేపు శ్రీకాకుళం 6, విజయనగరం 8, మన్యం 9, అల్లూరి జిల్లా చింతూరు మండలంలో వడగాల్పులు వీచే అవకాశం ఉందన్నారు. మంగళవారం శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, ఏలూరు, ఎన్టీఆర్, పల్నాడు, అనంతపురం, శ్రీ సత్యసాయి, వైయస్ఆర్, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తెలిపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఉరుములతో కూడిన వర్షం పడేపుడు ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. పొలాల్లో పనిచేసే రైతులు, వ్యవసాయ కూలీలు, పశు-గొర్రెల కాపరులు చెట్ల క్రింద, బహిరంగ ప్రదేశాల్లో ఉండరాదని సూచించారు. ఆదివారం సాయంత్రం 6 గంటల నాటికి పల్నాడు జిల్లా పెద్దకూరపాడు 55.5మిమీ, ఎన్టీఆర్ జిల్లా వత్సవాయి 40 మిమీ, జగ్గయ్యపేట 39.5 మిమీ, అల్లూరి జిల్లా అడ్డతీగల 38మిమీ, చింతపల్లి 36మిమీ, తూర్పుగోదావరి జిల్లా అనపర్తి 35.2 మిమీ, అనకాపల్లి రావికమతం 35.2మిమీ అల్లూరి జిల్లా రాజవొమ్మంగి 35మిమీ, తూర్పు గోదావరి జిల్లా బిక్కవోలు 31.5మిమీ చొప్పున వర్షపాతం నమోదైందన్నారు. దాదాపు 47 ప్రాంతాల్లో పిడుగులతో కూడిన వర్షాలు పడినట్లు తెలిపారు.

వైభవంగా వెంకటేశ్వరుని తిరువీధి ఊరేగింపు

విశాలాంధ్ర - పెందుర్తి : ఉత్తరాంధ్ర తిరుపతిగా ప్రక్షాతిగాంచిన పెందుర్తి వెంకటాద్రిపై బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం సాయంత్రం శ్రీవెంకటేశ్వర స్వామివారి తిరువీధి ఊరేగింపు మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు రామనుజాచార్యులు పర్యవేక్షణలో స్వామివారి సన్నిధి నుండి సుజాతనగర్ అలవేలుమంగా దేవి అమ్మవారి ఆలయం వరకు ఊరేగింపు కొనసాగింది. తప్పెటగుళ్లు, కోలాటం, మేళతాళలాతో అంగరంగ వైభవంగా సాగింది. ఈ కార్యక్రమంలో ఈఓ నీలిమ, ఆలయ ధర్మకర్త ఎంఎస్ రాజు, సిఐ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చట్టసభలలో ప్రజావాణిని వినిపించిన మహానేత సుందరయ్య



విశాలాంధ్ర - కూర్మన్నపాలెం : చట్టసభలలో ప్రజావాణిని వినిపించిన మహానేత పుచ్చల పల్లి సుందరయ్య అని స్టీల్ సిఐటియు అధ్యక్షులు వైటిదాస్ అన్నారు. పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి సందర్భంగా స్టీల్ సిఐటియు ఆధ్వర్యంలో స్టీల్ సిఐటియు కార్యాలయంలో ఆయన వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో వై టి దాస్ మాట్లాడుతూ ప్రజా గళాన్ని చట్టసభలలో వినిపించిన మహానేత పుచ్చలపల్లి సుందరయ్య అని ఆయన అన్నారు. నిరాడంబరతకు నిలువెత్తు నిదర్శనంగా ఆయన నిలిచారని కనుక అటువంటి వారిని స్మరించుకోవడం ద్వారా నేటి రాజకీయాలను ప్రక్షాళన చేయాలని ఆయన వివరించారు. ఆనాటి రాజకీయాలు ప్రజల సంక్షేమం కోసం, అభివృద్ధి కోసం జరిగేవని కానీ నేటి రాజకీయాలు స్వార్థం, అస్మదీయుల సంక్షేమం కోసమే మాత్రమే జరుగుతున్నాయని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. కనుక వీటిపై పోరాటం చేసి ప్రక్షాళన చేయవలసిన బాధ్యత మనందరిపై ఉందని ఆయన పిలుపునిచ్చారు. ముందుగా సుందరయ్య గారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్ఎఫ్ఐ అధ్యక్షులు పి రాము, స్టీల్ సిఐటియు ప్రతినిధులు కె.పి సుబ్రహ్మణ్యం, కె.బాలశౌరి, మొహిద్దిన్, సత్యనారాయణ, పుల్లారావు, శ్రీరామచంద్రమూర్తి, సూర్యనారాయణ, టి.చిరంజీవి, శాంత రాజ్, దొర, ఆర్ వెంకట్రావు, కెఆర్‌కె రాజు తదితరులతో పాటు కార్మికులు పాల్గొన్నారు.